దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంది

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

కీసర: రాష్ట్రంలో సైనిక్‌స్కూల్ కోసం కృషిచేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దమ్మాయిగూడలోని క్రాంతి కీస్ స్కూల్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవానికి ఎంపీ హాజరై మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందన్నారు. రాష్ట్రానికి తప్పక సైనిక్‌స్కూల్ వస్తుందని, వచ్చేంత వరకు తాను కృషి చేస్తానన్నారు. నవోదయ, సైనిక్‌స్కూళ్లలో ప్రతిభ చాటిన విద్యార్థులకు అవార్డులు అందించడం సంతోషంగా ఉందన్నారు. మనోహర్‌రెడ్డి, ప్రణీత, క్రాంతి, లావణ్య, కల్యాణి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి



శామీర్‌పేట్: మండల కేంద్రంలోని కట్టమైసమ్మ అమ్మవారిని మేడ్చల్ 7వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆమెకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మేడ్చల్ కోర్టులో శ్రావణి యాదవ్ జడ్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా శామీర్‌పేట్ కట్ట మైసమ్మను దర్శించుకున్నారు.

సమాచార హక్కు సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా జంగయ్య

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం ప్రాంతానికి చెందిన వంగూరి జంగయ్యను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నారపల్లికి చెందిన పెడబోయిన రామకృష్ణ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటిముదిరాజ్ సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

సెంట్రల్ ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



పోచారం: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ ముత్తవరపు వెంకటరమణను అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా (ఏపీటీఐ) తెలంగాణశాఖ ఘనంగా సత్కరించింది. సోమవారం చౌదరిగూడలోని ఏపీటీఐ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఖాళీ స్థలాలను పరిరక్షించండి !

మౌలాలి: మౌలాలి డివిజన్ బండ చెరువును ఆనుకుని ఉన్న శివానంద్‌నగర్, పూలపల్లి బాలయ్యకాలనీలోని ఖాళీ స్థలాలను కాపాడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. సోమవారం రంగనాథ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి డివిజన్‌లో కబ్జాలకు గురవుతున్న స్థలాల గురించి వివరించారు. ఆర్‌కేహెచ్‌కాలనీ పార్కు కూడా కబ్జాచేసి, ఇళ్లు కట్టిన విషయాన్ని గతంలోనే ఫిర్యాదు చేసినా.. సమస్య పరిష్కారం కాలేదని ఆమె సూచించారు.

కార్పొరేటర్ పర్యటన



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మారుతీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సోమవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ, సీసీరోడ్ల సమస్యలతో పాటు నాలా పక్కన రక్షణ గోడ నిర్మాణం తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కాప్రా: రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బంజారా కాలనీలో రోడ్డును ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారని, తక్షణమే ఆక్రమణదారులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఎస్ ప్రెసిడెంట్ ఎంపల్లి పద్మారెడ్డి, బంజారా కాలనీలవాసులు, మహిళలు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సర్కార్ నజర్!



- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 2,885
- మ్యుటేషన్లు, సర్వేనంబర్ల తప్పులపైనే అధిక ఫిర్యాదులు
- పరిష్కారానికి 1,308 మందికి రెవెన్యూశాఖ నోటీసులు

సాక్షి,సిటీబ్యూరో: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామస్థాయి రెవెన్యూ సదస్సుల్లో వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరిజిల్లాలో నిర్వహించిన 81 రెవెన్యూ సదస్సుల్లో 2,855 దరఖాస్తులు రైతులు, వివిధ వర్గాల ప్రజల నుంచి అందాయి.

మండలాల వారీగా దరఖాస్తులు..

మేడ్చల్ మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల నుంచి 346 దరఖాస్తులు రాగా.. శామీర్‌పేట్ మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల నుంచి 546, మూడుచింతలపల్లి మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల నుంచి అత్యధికంగా 984, ఘట్‌కేసర్ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల నుంచి 552, దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని 8 రెవెన్యూ గ్రామాల నుంచి 427 దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారానికి 1,308 నోటీసులు జారీ అయ్యాయి.

☛ మేడ్చల్ మండలంలో 222, శామీర్‌పేట్‌లో 169, ఎంసీపల్లిలో 151, దుండిగల్‌లో 390, ఘట్‌కేసర్ మండలంలో 376 నోటీసులు ఉన్నాయి.

కేటగిరీల వారీగా దరఖాస్తులు..

జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజలు వివిధ రకాల భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. తమ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు తప్పుగా ఉన్నాయని.. 752 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా.. మ్యుటేషన్ కోసం 378 మంది, డీఎస్ పెండింగ్‌పై 215, భూమి తక్కువగా నమోదైందని 269 మంది, భూమి స్వభావం తప్పుగా పడిందని 74 మంది, పట్టాదారుడి పేర్లు తప్పుగా ఉన్నాయని, 84 మంది, ప్రొహిబిట్ లిస్ట్ నుంచి తీసివేయాలని 170 మంది, నిషేధిత జాబితాలో పెట్టాలని 12 మంది, అసైన్డ్ భూములకు సంబంధించి ఫిర్యాదులు 244, ఓఆర్సీ జారీచేయాలని 31 దరఖాస్తులు రాగా.. 38-ఇ సర్టిఫికెట్ జారీకోసం 10, సక్సెషన్‌కు సంబంధించిన 358, భూసేకరణకు సంబంధించి 9, సాదా బైనామాకు సంబంధించి 122, భూ సర్వేకు 8, ఆధార్ సవరణకు 2, కోర్టు కేసులకు సంబంధించి 5, ఖాతా మెర్జింగ్ కోసం 8, సర్వే నెంబర్ డెలిషన్‌కు 17, కోర్టు ఆర్డర్‌కు 3, జీపీఏ 3, నాలా పీపీబీ 16, నాలా ట్రాన్స్‌ఫర్ 35, నేషనల్ ఖాతా నుంచి పట్టాకు 14, ఇతర భూ సమస్యలకు సంబంధించి 252 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల ఆధారంగా...

దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతులతో పాటు సమీపంలోని కర్షకులకు అధికారులు నోటీసులు జారీ చేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,805 నోటీసులను సంబంధిత రైతులకు రెవెన్యూశాఖ అందజేసింది. ఇరువర్గాల వద్ద ఉన్న పత్రాలతో పాటు ఆధారాలను సమర్పించేందుకు 7 రోజుల గడువు విధిస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, పత్రాలను పరిశీలిస్తారు. వీటిని రెవెన్యూ కార్యాలయంలోని పత్రాలతో పోల్చుతారు. అనంతరం సదరు దరఖాస్తు వాస్తవికతను తేల్చనున్నారు.

భూ సమస్యపై భూభారతి పోర్టల్

ధరణి పోర్టల్‌తో భూ సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో పాటు రెవెన్యూతో సహా సంబంధిత కార్యాలయాల చుట్టూ రైతులు, ప్రజలు ప్రదక్షిణలు చేసి విసుగుచెందారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూభారతి పోర్టల్‌ను ప్రారంభించింది. భూ భారతిపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు నిర్వహించింది.

పెరిగిన ఆశలు..

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. తెల్ల కాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ జరగదని రైతులు భావిస్తున్నారు. కోర్టు చిక్కుముళ్లు వీడితే జిల్లాలో భూ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కానున్నట్లు తెలుస్తోంది.

సైబర్ వలలో క్యాబ్ డ్రైవర్!

రూ.1.23 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పోచారం: సైబర్ క్రైమ్ వలకు ఓ క్యాబ్ డ్రైవర్ చిక్కి రూ.1.23 లక్షలు పోగొట్టుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం .. పోచారంలోని కాకతీయనగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి (41) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మే 5న తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. కాల్‌కు సమాధానం ఇస్తుండగా.. అటువైపున మహిళ కనిపించడంతో కాల్‌ను కట్‌చేసి, ఫోన్ నెంబర్‌ను డిలీట్ చేశాడు. మరుసటి రోజు మధ్యాహ్నం మరో తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి తాము యూట్యూబ్ నుంచి మాట్లాడుతున్నామని, తన వీడియో వైరల్ అవుతుందని, తర్వాత పోలీసు అధికారులు ఫోన్ చేస్తారని చెప్పి కాల్ కట్ చేశారు. 10 నిమిషాల తర్వాత ఢిల్లీ పోలీస్ కమిషనరేట్ నుంచి మాట్లాడుతున్నట్లు వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. యూట్యూబ్ వాళ్లకు ఫోన్ చేసి, వీడియో డిలీట్ చేయించి రిపోర్టు పంపమని చెప్పారు. అదే నెంబర్‌కు మధుసూదన్ ఫోన్ చేయగా.. 3 యూట్యూబ్ చానల్స్ వైరల్ అవుతున్నాయని, ఒక్కో చానల్‌ను డిలీట్ చేయడానికి రూ. 31 చెల్లించాలని ఫోన్‌లో వ్యక్తి డిమాండ్ చేశాడు. మే 6న బాధితుడు రూ.93 వేలు చెల్లించాడు. మరుసటి రోజు మరో రూ. 30వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. దీంతో మొత్తం రూ. 1.23 లక్షలు బదిలీచేసి, చివరకు తాను మోసపోయానని గ్రహించి మే 15న సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు!

రూ. 4 కోట్ల విలువైన స్థలాన్ని పరిరక్షించాలని వినతి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో పబ్లిక్ పార్కును కొందరు వ్యక్తులు దర్జాగా కబ్జాచేసి ఇళ్లు నిర్మించుకుంటున్నారని, మాజీ కౌన్సిలర్ బాలోగని వెంకటేష్‌గౌడ్ అదే ప్రాంతానికి చెందిన స్థానిక నాయకుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అన్నోజిగూడలోని సర్వేనెంబర్లు 44, 45లో సుమారు 1100 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలంలో మున్సిపల్ అధికారులు గతంలో నర్సరీని ఏర్పాటు చేశారని చెప్పారు. తర్వాత కొందరు వ్యక్తులు బై నెంబర్లతో పత్రాలు సృష్టించుకుని పార్కును కబ్జాచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే అక్రమంగా 3 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.



కమిషనర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

సుమారు రూ. 4 కోట్ల విలువైన పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కమిషనర్ వీరారెడ్డిని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మౌలిక వసతులు కల్పించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ నార్త్‌లోని శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లోను నియంత్రించేందుకు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాకతీయనగర్‌వాసులు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, కొమురయ్య, వెంకటాచారి, సత్యనారాయణ, అజయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

కుషాయిగూడ: ప్రతి ఒక్కరూ సామాజిక దృక్పథంతో సేవాభావాన్ని అలవర్చుకోవాలని వాసవీక్లబ్ డిస్ట్రిక్ వైస్ చైర్మన్ సముద్రాల కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. పేదలకు సాయంచేయాలనే సంకల్పంతో ఏర్పాటైన వాసవీక్లబ్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ.. ముందుకు సాగుతుందన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు నేర్లకంటి శ్రీనివాస్, ఉమాదేవి, శ్రీనివాస్, రజిత, సత్యనారాయణ, నాగేందర్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలో బీరప్పగడ్డ దేవాలయం వద్ద గల పౌరసఫరాల పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్నబియ్యం నాణ్యతను ఎమ్మెల్యే పరిశీలిస్తూ.. పంపిణీపై లబ్ధిదారులను ఆరా తీశారు. షాపు యాజమాని ఆగంరెడ్డి రేషన్ పంపిణీ గురించి వివరించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని వివరించారు. 30 వరకు షాపును ప్రతిరోజూ తెరిచి ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు.

హనుమాన్ ఆలయంలో చోరీ..

60 తులాల వెండి ఆభరణాల అపహరణ

శామీర్‌పేట్: హనుమాన్ దేవాలయంలో చోరీ జరిగిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజారి రోజూమాదిరిగానే ఆదివారం రాత్రి ఆలయానికి తాళం వేసి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున పూజలు నిర్వహించేందుకు వెళ్లగా.. అప్పటికే గుడి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా స్వామివారి వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గమనించి శామీర్‌పేట్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పూజారి పోలీసులకు తెలిపాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

మేడిపల్లి: ఇంటినుండి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తిజిల్లా పెబ్బేరు మండలానికి చెందిన సాయిరాం (27) పీర్జాదిగూడ బాలాజీనగర్‌లో నివాసం ఉంటూ.. చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. గత మార్చినెలలో తన సొంతూరుకు వెళ్లొచ్చి నగరంలోని ఇంటిని ఖాళీచేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్టు

కుషాయిగూడ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. నెహ్రూనగర్, పోచమ్మ ఆలయం సమీపంలో కారులో గంజాయి తరలిస్తున్న నలుగురిని ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని చర్లపల్లి పోలీసులకు అప్పగించారు. వారిలో శశివర్ధన్, మహమూద్, హకీం, అభిలాష్ ఉన్నారని, వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల్లో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాల్సిన అవసరం ఉందని, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని భవానీనాగలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. గత 3 ఏళ్లుగా నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, దేవాలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, బలవంతరావు, సూర్యశేఖర్‌రెడ్డి, నర్సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, అరవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు

వీబీఐటీలో డిజైన్ మోడలింగ్‌పై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వీబీఐటీ చైర్మన్

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) లో ' వీఎల్ఎస్ఐ డిజైన్, మోడలింగ్‌లో తాజా ధోరణులు ' అనే అంశంపై సోమవారం జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. డిజైన్ రంగంలో జరుగుతున్న తాజా అభివృద్ధి, పరిశోధన దిశలు, సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వీబీఐటీ చైర్మన్ డాక్టర్ గౌతమ్‌రావు, సెక్రటరీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు విలువైన సాంకేతిక నైపుణ్యానికి ఇలాంటి సదస్సులో విరివిగా పాల్గొనాలని, విద్యా పరిశోధన రంగాల్లో ఉన్నత ప్రమాణాలు సాధించడానికి ఈ సదస్సులు దోహదపడతాయని తెలిపారు. వీబీఐటీ ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ విద్యాసాగర్, అధ్యాపకులు, పలు విద్యాసంస్థల పరిశోధకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కింది బస్తీలో మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నేతలు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సోమవారం అధికారులు, కాంగ్రెస్‌నేతలు కింది బస్తీలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులందరికీ ఇళ్లు అందెలా చూస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్ మహేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ శంకర్, నాయకులు సంతోష్‌గౌడ్, రాకేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి



ఘట్‌కేసర్‌లో ప్రొసిడింగ్ అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపాలిటీలో 75 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం ప్రొసిడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో గూడు లేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మంజూరైన వారందరూ గడువులోగా ఇళ్లను నిర్మించుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కుమార్‌ముదిరాజ్, మచ్చేందర్‌రెడ్డి, అమర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, మాధవరెడ్డి, మల్లేష్, దేవేందర్‌ముదిరాజ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజుముదిరాజ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు, ఖయామ్, సత్తిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో సమస్యల పరిష్కారం



స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం సత్తిరెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వ్యర్థాల పారబోత, భవన నిర్మాణ వ్యర్థాలను కూడా రోడ్ల పక్కన పారబోస్తున్నారని, అలా చేయకుండా జీహెచ్‌ఎంసీ సీడీ విభాగం సిబ్బందికి అందించాలని సూచించారు. వారు తక్కువ ధరకే తరలిస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు రాములు, శేఖర్, బాబు,"సత్యనారాయణ, కిషోర్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, శాస్త్రి పాల్గొన్నారు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి..

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత అన్నారు. సోమవారం మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో రాజా శ్రీనివాసనగర్, రాజానగర్ కాలనీల్లో వర్షాకాలం ముందస్తుగా ప్రత్యేక పారిశుద్ధ్య నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై పారిశుద్ధ్యంపై మాట్లాడారు. మేకల రాము, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది నర్సింగ్‌రావు, చిట్టిబాబు, ప్రభాకర్, స్వప్న, భాగ్యరేఖ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోలకే వ్యర్థాలను అందించాలి..

మల్లాపూర్: చెత్తను ఇష్టానుసారంగా పారబోయకుండా ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో రిక్షాకే అందించాలని నాచారం కార్పొరేటర్ శాంతి అన్నారు. సోమవారం నాచారంలో పారిశుద్ధ్యంపై సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ విభాగం ఏఈ రమేష్, పరమేష్, యూబీడీ సూపర్ వైజర్ శ్రీనివాస్, రామ్‌కీ సంస్థ సూపర్ వైజర్ నవీన్‌రెడ్డి, జవాన్, ఎస్ఎఫ్ఏలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



రాజాశ్రీనివాసనగర్‌లో కార్పొరేటర్ సునీత

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

మల్లాపూర్: నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నాచారంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలను ప్రధాని నరేంద్రమోదీ నెరవేస్తున్నారన్నారు. ఎస్టీమోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, జిల్లా బీజేపీ కార్యవర్గసభ్యులు రవికాంత్, డివిజన్ బీజేపీ సీనియర్ నేతలు మల్కా ప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, చంద్రమౌళి, ఆనంద్‌గుప్తా, ప్రతాప్‌రెడ్డి, సాయిగౌడ్, మంజుల వాణి, లావణ్య, వరలక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387